## కథ

# వాన వెలిసింది



కళ్ళు తెరచి చూసే సరికి గదిలో వెలుగు బాగా తగ్గిపోయి వుంది. వారం రోజుల నుంచి వరుసగా 'రాత్రి' డ్యూటీ చేయటంవల్ల మత్తుగా నిద్ర పట్టేసింది.

ఎదురుగా గోడ మీద వున్న గడియారం వైపు చూసాను, టైమ్ తెలుసుకుందామని. కానీ గడియారం ముల్లు కదలటం లేదు.

సంవత్సరాల తరబడి విరామం లేకుండా, క్రమ బద్ధంగా తిరిగే గడియారానికి విసుగే వచ్చిందో, మార్పే కావాల్సి వచ్చిందో తెలీదుగానీ అది ఆగిపోయి వుంది.

గబగబా లేచి గుమ్మం తలుపు తీసి చూసాను.

ఉదయాస్తమయాల ఆవర్తనే జీవితంగా మారినందుకు ఆకాశం అలిగినట్లుంది; కరి మబ్బుల కోప వీచికలు ఆమె మోముపై స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వీధి దీపాలు వెలగలేదు. కనుక ఆరు గంటలు అయి వుండదు అని అనుకున్నాను. బడికి వెళ్ళిన పిల్లలు అప్పుడప్పుడే ఇళ్ళకు చేరుకుంటున్నారు. రోడ్డు మీద కూరగాయలమ్మే వాళ్ళ కేకలు, అక్కడక్కడ ఆటలాడే పిల్లల కేరింతలు వినిపిస్తున్నాయి.

ఇవన్నీ మామూలే! రోజూ సాయంకాలం కనిపించే దృశ్యాలే! ఏమీ మార్పు లేదు!

నాకు విసుగు వచ్చింది. ఏదో మార్పుని గురించి తాపత్రయ పడే నేను ఆ ఆవర్తనని భరించలేక పోయాను.

తలుపు గట్టిగా వేసి లోపలకు వెళ్ళాను. ఓ టీ కలుపుకొని తాగాలి. ఆ తర్వాత...

ఆ తర్వాత ఏముంది? స్నానం చెయ్యటం, భోజనం చెయ్యటం, డ్యూటీకి వెళ్ళటం...

నాకు నా మీదే కోపం వచ్చింది. బతుకు తెరువు కోసం చేపట్టిన ఉద్యోగమే ఇప్పుడు బతుకై కూర్చుంది.

టీ కలుపుతూ ఆలోచించాను, పోనీ క్లబ్‌కి వెళితే...క్లబ్‌లో కార్డ్స్ ఆడుకోవచ్చు. కానీ కార్డ్స్ ఆడటం నాకు రాదు. బిలియర్డ్స్ గానీ టెన్నిస్ గానీ ఆడటం అసలే రాదు మరి...

మరి స్నేహితుల ఇళ్ళకి వెళదామంటే వాళ్ళు డ్యూటీలో వుంటారు. మరి టైమ్ గడపడమెలా?

టీ కప్పు పుచ్చుకుని బాల్కనీలోకి వచ్చాను. ఆకాశమంతా నల్లని మబ్బు చేరిపోయి వుంది. వాన పడుతుందో, ఏమో?

మబ్బు నిండిన ఆకాశం రోజూ చూసే ఆకాశంలా లేదు. ఏదో తేడా వుంది. ఆ మార్పు నన్ను ఆకర్షించింది. ఆకాశం చూస్తూ ఆలోచిస్తూ నించున్నాను.

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా" ఓ సారి నా స్నేహితుడు గోపాల్ అన్నాడు "నీకూ చింతా లేదు. వచ్చిన జీతమంతా హాయిగా ఖర్చు పెట్టుకోవచ్చు, జల్సాగా తిరగొచ్చు-ఏ బాధా లేదు."

"నీ కేంటంట పాపం బాధలు?"

"నీకేం తెలుసురా మా బాధలు. షిఫ్టులో ఇక్కడ డ్యూటీ చెయ్యాలి. ఇంటికి వెళ్ళి అక్కడా డ్యూటీ చెయ్యాలి. పిల్లలను స్కూల్లో దింపి రావాలి. వాళ్ళచేత హోం వర్కులు చేయించాలి, సరుకులు తేవాలి..."

"బోర్ కొట్టేస్తుందనుకో"

నేనదోలా నవ్వేను.

"అదేంటిరా అలా నవ్వుతున్నావ్?" గోపాల్ అడిగేడు.

"ఏం లేదురా. రోలు వచ్చి మద్దెలతో మొరపెట్టుకుందట. నేనే బోర్ కొట్టి చస్తుంటే..."

గాలితోపాటు వచ్చిన వానజల్లు మొహానికి తగిలింది. కాళ్ళ దగ్గర పడివున్న పేపరు తీసికొని ఇంటిలోకి వెళ్ళాను. పేపర్ విప్పాను. కానీ చదవాలని అనిపించలేదు.

వార్తలు మామూలే-రెండు రైలు ప్రమాదాలు, నాలుగు ఉగ్రవాదుల హత్యలు, బేంక్ దోపిడీ, రాజకీయ నాయకుల విజ్ఞప్తులు-అంతా మామూలే.

విసుగొచ్చి పేపర్ బల్ల మీద పడేసాను.

తన మనస్సులోని దుఃఖమంతా వాన రూపంలో ఒలక బోస్తోంది ఆకాశం.

ప్రక్క క్వార్టరులో ప్రసాద్ గొంతు వినిపిస్తోంది.

ఓసారి వాడి ఇంటికి వెళ్ళి కాసేపు గడిపితే...

"ఇలా ఒంటరిగా గడిపే బదులు మళ్ళీ పెళ్ళి చేసుకో కూడదురా" వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఎప్పుడో ప్రసాద్ అడిగేడు.

"అవునన్నయ్యగారు" అతని సతీమణి అంది "ఈ డ్యూటీలు చెయ్యడం, వండుకుని తినటం, అంతా కష్టంకదా?" టీ కప్పు అందిస్తూ అంది ఆమె.


"ఆవిడ ఎలాగూ పోయారు. ఆవిడ గురించి బాధపడుతూ కూర్చుంటే ఎలాగండీ! పోనీ పిల్లలైనా వుంటే వాళ్ళని చూస్తూనైనా రోజులు గడిచిపోయేవి."

నేనేమీ అనలేదు. ఎదురుగా వున్న అద్దంలో నెరిసిన నా జుట్టు ఎండిపోయిన నా మొహం కనిపించాయి.

"నిన్ను మేమేమీ బలవంతం చెయ్యటం లేదురా" మళ్ళీ అన్నాడు ప్రసాద్. "ఎవరికైనా జీవితంలో లక్ష్యం వుంటూ ఒకటుండాలి. అది లేకపోతే బతుకు బోర్ కొడుతుంది."

నేను మాటల కోసం వెతికేను. కానీ దొరక లేదు.

"మన తర్వాత మరో తరాన్ని తయారు చెయ్యాలి. అది మన బాధ్యతరా" ప్రసాద్ అన్నాడు.



— ఎల్. ఆర్. స్వామి

నేనేం అనలేక పోయాను.

మా ఫ్యాక్టరీలో నిర్విరామంగా తిరిగే యంత్రాల్లా నేనూ తిరిగేను. శిశిర, హేమంత, వసంత ఋతువులు ఎవరి షిఫ్టులు వారు చేసుకొని పోయారు.

నాకు విసుగు పెరిగింది. ఏదో ఒక అస్పష్టత. ఏ పనిలోనూ మనస్సు నిలవటం లేదు. ఏదో ఓ బద్ధకం. శారీరకంగా బలహీనత-డాక్టరు దగ్గర కెళ్ళాను.

"నీకు శారీరకంగా ఏ జబ్బూ లేదోయ్" భుజం తట్టి అన్నాడు డాక్టర్.

"ఏమోనండీ డాక్టరుగారు, నాకు ఎలాగో వుందండీ. జీవిత మంటేనే బోర్ కొడుతోంది. రోజూ ఒకే రొటీన్"

"అలాగంటే ఎట్లాగయ్యా? జీవితం మీద ఇంట్రస్ట్ పెంచుకోవాలి" డాక్టర్ అన్నాడు. "నాకు మాత్రం బోర్ కొట్టటం లేదను కున్నావా, రోజూ లేవగానే క్లినిక్‌కు రావటం, విసీ, విసీ అలవాటయిన రోగ లక్షణాలు వినటం, రాసిన మందులే మళ్ళీ మళ్ళీ రాయటం. అయినా ఇలా నవ్వుతూ బతుకుతున్నాను-ఎందుకో తెలుసా?"

"ఎందుకు?"

"మనకు మన ముందుతరం అందించిన విజ్ఞానాన్ని వచ్చే తరానికి, అందించటానికి."

అతని మాటలు నాకు నచ్చలేదు.

'ఋతువు' అనే కర్మాగారంలో షిఫ్టులు మారాయి. డ్యూటీకి దిగిన ముద్దబంతులు బదులుగా మల్లెలు, సన్నజాజులు వచ్చాయి.

నాకు రోజు రోజుకూ విసుగు పెరిగింది. జీవితం మీద విరక్తి కలిగింది. చచ్చిపోవాలని అనిపించింది. చచ్చి జీవితం మీద నాకున్న కసి తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాను.

వాన వెలిసినట్లుంది. కిటికీలో మంచి వెలుతురు పొడుచుకు వచ్చింది.

ఓసారి అలా తిరిగి వద్దామని లేచి షర్టు వేసుకున్నాను. జేబు తడిమి చూసాను. పర్సు వుంది. పర్సులో డబ్బు కూడా వుంది. డబ్బుతోపాటు ఏదో కాగితం కూడా చేతికి తగిలింది. అది తీసి చూసాను.

ఎప్పుడో రెండు నెలల క్రితం వ్రాసి వుంచిన నా ఆత్మహత్యా చీటీ అది!

గబగబా నడిచేను. రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

కడుపులోని దుఃఖమంతా వాన రూపంలో ఒలక పోసినా, ప్రపంచమింకా కుమిలి పోతూనే వుంది.

"బాబుగారండీ..."

రోడ్డు మలుపు తిరుగుతుంటే ఎవరో పిలిచినట్లయింది. వెనక్కి తిరిగాను. ఎదురుగా నిలబడి వున్నాడు ఓ ఐదేళ్ళ కుర్రాడు. ఒళ్ళంతా మట్టి కొట్టుకుపోయి వున్నాడు. మా వీథి చివర వుంటున్న వాచ్‌మెన్ కొడుకు కాబోలు వాడు.

"చూడండి బాబుగారూ! వీళ్ళు నన్ను ఆటల్లో చేర్చుకోటం లేదు" ఏడుస్తూ అన్నాడు వాడు.

ఎదురుగా పది మంది పిల్లలు రోడ్డు వారగా నిలచి వున్న వాన నీటిలో కాగితం పడవలు వదిలి ఆడుకుంటున్నారు.

ఆ కుర్రవాడిని చూస్తుంటే జాలి వేసింది.

"వీడిని కూడా ఆటల్లో చేర్చుకోండిరా" రెండడుగులు ముందుకు వేసి అన్నాను.

వాళ్ళు పక పక నవ్వేరు. "వాడికి ఏ ఆటలు రావండీ. 'రింగా రింగా రోజెస్' రాదు, కాగితం పడవలు చేయటం రాదు. మా ఆటలే కాదు కనీసం ఇంగ్లీషు కూడా రాదు."

ఆ కుర్రవాడు గట్టిగా ఏడ్చాడు.

"ఏడవకు. దీతో నేను ఆడతాను" ఆ కుర్రవాడి చేతిలోని కాగితాలు అందుకున్నాను. పడవలు చేసి వాడికి ఇస్తూ అడిగేను "బడికి వెళ్ళటం లేదా?"

"ఎలా వెళతాను బాబూ! ఇంటి దగ్గర తమ్ముడిని చూసుకోవాలి కదా!"

కాగితం పడవలు నీళ్ళలోకి వదిలాడు వాడు. ఆ మొహంలో చిగురించిన ఆనందం నాకెంతో సంతృప్తిని ఇచ్చింది.

"నీకు నిజంగా బడికి వెళ్ళాలనీ, చదువుకోవాలనీ వుందా?"

"ఉంది బాబూ! ఆ బాబుల్లా ఇంగ్లీషు నేర్చుకోవాలని వుంది." ఓ నిముషం ఆలోచించాను. నాకున్న విజ్ఞానాన్ని రేపటి తరానికి అందించటం నా బాధ్యత.

"రోజూ మా యింటికి వచ్చి చదువు నేర్చుకుంటావా?"

"అలాగే బాబు. నేర్చుకుంటాను."

వాడి కంట్లో మెరిసిన మెరుపే వీథి దీపాలుగా వెలిగాయి. పిల్లలు ఒక్కొక్కరూ ఇళ్ళకు బయలుదేరారు. వాళ్ళని చూస్తూ నించున్నాను.

"రేపు ఈవేళకల్లా మీ యింటికి వస్తాను బాబు" ఆ కుర్రవాడు వెళ్ళి పోయాడు.

రేపు వాడు వస్తాడు. రోజూ వస్తాడు. సాయంత్రం పూట వాడికి చదువు చెప్పాలి. మిగతా పిల్లల స్థాయికి వీడిని తీర్చిదిద్దాలి.

జేబులోనించి ఆత్మహత్య చీటీ తీసాను. పడవ చేసి నీళ్ళలో వదిలాను.

ఇంటికి నడిచాను. రేపు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ...

మబ్బు వీడిన ఆకాశం అందంగాను, నిర్మలంగాను కనిపించింది.

ఇంటి మెట్లు ఎక్కుతుంటే ఆకాశాన రాత్రి డ్యూటీ కెక్కిన చంద్రుడు నన్ను చూసి ఆప్యాయంగా నవ్వేడు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్